VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 94

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 8 సెప్టెంబర్ 2026

## కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి: లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు

- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి



**అమరావతి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి..** స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

## స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం-మంత్రి నారాయణ

- వెంకయ్యనాయుడు వ్యక్తి కాదు-ఓ వ్యవస్థ
- ఆయన ఆలోచనల నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్ పురుడు పోసుకొంది
- పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు-గ్రామీణ యువత నైపుణ్యాలు పెంపొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది
- 25 ఏళ్ళుగా సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది
- రజతోత్సవ వేడుకల్లోస్వర్ణభారత్ ట్రస్ట్ సేవలను కొనియాడిన మంత్రి నారాయణ





**వెంకటాచలం,కలంకౌంటర్ :** సమాజ సేవే లక్ష్యంగా గత 25 ఏళ్ళుగా స్వర్ణభారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవ వేడుకల్లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడులతో కలిసి మంత్రి నారాయణ వేదిక పంచుకున్నారు. అంతకు ముందు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు మంత్రి నారాయణ పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్షర విద్యాలయం ప్రాంగణంలోని సోమా స్కిల్ సెంటర్‌ను యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి సందర్శించి, విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

**25 ఏళ్లుగా సేవా ప్రస్థానం..** మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మానసపుత్రికగా స్వర్ణభారత్ ట్రస్ట్ 2001లో ప్రారంభమైందని మంత్రి నారాయణ తెలిపారు. సమాజానికి, జన్మనిచ్చిన ప్రాంతానికి తన వంతుగా ఏదైనా చేయాలనే సంకల్పంతో ఏర్పాటైన ఈ సంస్థ నేడు లక్షలాది మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు.నెల్లూరుతో పాటు విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లోనూ సేవా కార్యక్రమాలను విస్తరించి ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకువస్తోందని పేర్కొన్నారు. వెంకయ్యనాయుడు స్నేహితుడు కామినేని వెంకటేశ్వర్లు ఛైర్మన్‌గా, ఆయన కుమార్తె శ్రీమతి దీపా వెంకట్ మేనేజింగ్ ట్రస్టీగా సేవలు అందిస్తున్నారని తెలిపారు.

**పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు..** పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు.గ్రామీణ యువత నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి,అన్నదాతలు ఆధునిక వ్యవసాయ విధానాలతో ఆర్థికంగా బలపడాలి,పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి,మహిళలు సాధికారత సాధించి ఆర్థికంగా ఎదగాలి అనే లక్ష్యాలతో ట్రస్ట్ ముందుకు సాగడం అభినందనీయమని మంత్రి నారాయణ అన్నారు.ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం పొందకుండా, విదేశాల నుంచి ఎటువంటి సాయం తీసుకోకుండా 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలను కొనసాగించడం స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రత్యేకత అని చెప్పారు.

**విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట..** స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారిత సైబర్ గ్రామీణ్ శిక్షణ కేంద్రం,

- 2లో

## ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

- ఏపీ భవన్లో ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రాష్ట్ర ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాలకూ అత్యుత్తమ నాణ్యతతో కూడిన సరుకులు అందజేత.
- కేఎన్ఎం, బీపీటీ వంటి రకరకాల బియ్యం వెరైటీలు అందుబాటులో ఉంచేలా చర్యలు.
- ఎన్‌సీసీఎఫ్ ద్వారా 64 రకాల నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరలతో విక్రయం.





**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'రైస్ అవుట్‌లెట్'ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సీసీఎఫ్ (NCCF) ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఏకే జైన్, ఏపీ భవన్ అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే టీడీపీకి అసలైన బలం.. ప్రజలకు అందుబాటులో ఉంటేనే రాజకీయ భవిష్యత్

- అధికారం ప్రజలకు సేవ చేసేందుకు దక్కిన అవకాశం.. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకత్వం సమష్టిగా పనిచేయాలి
- ప్రజలను ఇబ్బంది పెడితే భవిష్యత్‌లో గెలుపు కష్టమే: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు






**మంగళగిరి/అమరావతి, కలంకౌంటర్ :** దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ గ్రామస్థాయి నుంచి అత్యంత బలమైన క్యాడర్, కార్యకర్తలు, నాయకత్వ వ్యవస్థ కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఇంత బలమైన కార్యకర్తల వ్యవస్థ కలిగిన తెలుగుదేశం పార్టీలో పనిచేసే అవకాశం లభించడం ప్రతి ఒక్కరి అదృష్టమని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన తెలుగుదేశం లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లో లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. భగవంతుడు ప్రతి ఒక్కరికీ జీవితంలో ఏదో ఒక రంగంలో అవకాశం కల్పిస్తారని మంత్రి అన్నారు. ఐదు కోట్ల జనాభా ఉన్న రాష్ట్రంలో కేవలం 175 మందికి మాత్రమే ఎమ్మెల్యేలుగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని, అలాంటి అరుదైన అవకాశాన్ని పొందిన ప్రతి ఒక్కరూ దాని విలువను గుర్తించాలని సూచించారు. పదవి రావడం ఎంత ముఖ్యమో.. వచ్చిన పదవిని నిలబెట్టుకోవడం అంతకంటే ముఖ్యమని అన్నారు. మనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ అవకాశం శాశ్వతం కాదు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుని, దాన్ని నిలబెట్టుకోవాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలి. అలా పనిచేస్తే తప్పకుండా విజయాన్ని సాధించగలం అని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలు, ప్రజలతో ఎమ్మెల్యేలు నిరంతరం మమేకమై ఉండాలని అచ్చెన్నాయుడు సూచించారు. ప్రతి సమస్యను పరిష్కరించగలగడం సాధ్యం కాకపోయినా, కనీసం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అండగా నిలవాలని అన్నారు. ప్రజలకు ఏమీ చేయలేకపోయినా ఫర్వాలేదు.. కానీ వారిని ఇబ్బంది పెట్టడం, వేధించడం మాత్రం చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నాయకులకు రాజకీయంగా భవిష్యత్తు ఉండదని మంత్రి హెచ్చరించారు. ప్రజలే రాజకీయ నాయకులకు అధికారం ఇస్తారని, అదే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే ఎలాంటి పదవిలో ఉన్నా తిరిగి గెలవడం కష్టమవుతుందని అన్నారు.

**ప్రజలకు ఒక నమ్మకం కల్పించాలి..** ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఫలానా సమయంలో ఎమ్మెల్యే గారిని కలవచ్చు.. ఆయన అందుబాటులో ఉంటారు అనే విశ్వాసం ప్రజల్లో ఏర్పడితే చాలా వరకు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని చెప్పారు. ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండటం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, చిన్నచిన్న సమస్యల కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు. ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. టీడీపీకి గ్రామస్థాయి నుంచి బలమైన కార్యకర్తల బలం ఉందని, ఆ బలాన్ని ప్రజా సేవకు ఉపయోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. పార్టీ నాయకత్వం, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని మరింత పెంచుకోవాలని అన్నారు. పదవులు ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన అవకాశాలే తప్ప.. అధికారాన్ని చెలాయించడానికి కాదనే విషయాన్ని ప్రతి ప్రజాప్రతినిధి గుర్తుంచుకోవాలి అని అచ్చెన్నాయుడు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, కార్యకర్తలను గౌరవించడం, ప్రజల సమస్యలను పరిష్కరించడమే నాయకత్వానికి అసలైన కొలమానమని పేర్కొన్నారు.

## అమరావతిపై నాకు అభ్యంతరం లేదు.. మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు: విజయసాయిరెడ్డి

- ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి
- రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న
- తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి



**విజయవాడ, కలంకౌంటర్ :** "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం
- ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్టు మంత్రి వెల్లడి
- అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు

- 3లో

## విద్యార్థులు మూఢ నమ్మకాల పట్ల దూరంగా ఉండాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** విద్యార్థిని విద్యార్థులు మూఢనమ్మకాలు పట్ల దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్ దుర్గా సాగర్ అన్నారు. సైన్స్ ఆధారితంగా భౌతిక పద్ధతిలో విద్యార్థిని విద్యార్థులు ఆలోచనలు ఉండాలని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు సైన్స్ రంగం పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. మానవులు అంతరిక్షంలోకి వెళ్లే స్థాయికి మానవులు అభివృద్ధి చెందారంటే సైన్స్ రంగం కీలక బాధ్యత వహిస్తుందని అన్నారు. మానవునికి రోగం వస్తే డాక్టర్ దగ్గరికి వెళితే తగ్గుతుంది తప్ప మంత్రాలు ప్రార్థన చేస్తే ఉన్న రోగం ఎక్కువ అవుతుందని తెలిపారు . విగ్రహాలు ముందు కూర్చుంటే చదువు రాదని విజ్ఞానవంతులైన గురువుల ముందు చదువు నేర్చుకుంటే చదువు వస్తుందని చెప్పారు. సోమవారం నాడు స్థానిక నాగళ్ళ రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల స్థాయి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయ్యూరులోని పలు ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు టెస్టులు పాల్గొని చురుకుగా నిర్వహించిన పరీక్షలు పాల్గొన్నారు. ఈ టెస్ట్ లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు జే వి వి సర్టిఫికెట్, సైన్స్ రంగంకు సంబంధించిన పుస్తకాలు విద్యార్థులకు బహుమతులుగా ఎంఈఓ దుర్గా సాగర్, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త యు విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కొలుసు విశ్వమోహన్ విశ్రాంత ఎంఈఓ హస్సన్ యుటిఎఫ్ జిల్లా నాయకులు జి లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక బాధ్యులు దొప్పలపూడి సత్య ప్రసాద్ సిఐటియు మండల కన్వీనర్ బి రాజేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలను పరిష్కరించాలి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 30 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 22, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లు 2, ఇతర అంశాలకు సంబంధించినవి 3 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలపై చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లాపోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డి.సి.ఆర్.బి. సిఐ కే.కుమార స్వామి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లాలో భారీ వర్షం.. చినగంజాం జలమయం

- చినగంజాంలో మోకాళ్ల లోతు నీటితో స్తంభించిన రాకపోకలు
- ఉప్పు మడుల్లో నీరు చేరడంతో నష్టపోయిన రైతులు
- గుంటూరు, బాపట్ల సహా నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ
- గంటకు 60 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని విపత్తుల సంస్థ హెచ్చరిక



**బాపట్ల జిల్లా,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా చినగంజాం మండలంలో కురిసిన కుండపోత వానకు జనజీవనం స్తంభించింది. పలు రహదారులు మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అకాల వర్షం కారణంగా ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోయారు. తీయడానికి సిద్ధంగా ఉన్న ఉప్పు మడుల్లోకి వర్షపు నీరు చేరడంతో ఉప్పంతా కరిగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) హెచ్చరిక జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైతులు, వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని, చెట్లు, కరెంట్ స్తంభాల కింద నిలబడకూడదని స్పష్టం చేసింది. గాలుల తీవ్రతకు బాపట్ల జిల్లాలోని జాతీయ రహదారిపై ఓ సూచిక బోర్డు కూలిపోయిన ఘటన కూడా చోటుచేసుకుంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో, ముఖ్యంగా బాపట్ల జిల్లాలో వర్షపాతం లోటు గణనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో తాజా వర్షాలు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, స్థానికంగా నీరు నిలిచిపోవడం, ఉప్పు రైతులు నష్టపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. విపత్తుల సంస్థ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు కోరుతున్నారు.

## సంక్షేమాన్ని మాటల్లోనే కాదు... గణాంకాల్లో కూడా చూపిస్తున్నాం

### -రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత





**మంగళగిరి/అమరావతి,కలంకౌంటర్ :** ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని, ప్రతి కుటుంబానికి అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కేవలం రెండేళ్లలో 90 శాతం అమలు చేశామని, మాటల్లో కాకుండా గణాంకాల్లో కూడా చూపిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రైతు, మహిళ, విద్యార్థి, బీసీ, మత్స్యకారుడు, చేనేత కార్మికుడు, దివ్యాంగుడు.. ఇలా ప్రతి వర్గానికీ అండగా నిలుస్తున్నామన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన తెలుగుదేశం లీడర్ షిప్ కాంక్లేవ్ సందర్భంగా మంత్రి సవిత ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను వెల్లడించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం భారీగా నిధులు ఖర్చు చేసి, మాట నిలబెట్టుకున్న ప్రభుత్వంగా నిలిచామని తెలిపారు. 24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీనిలో భాగంగా రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు తీసుకొచ్చి యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని తెలిపారు. పేదలందరికీ విద్య హక్కు కల్పించడంలో భాగంగా తల్లికి వందనం పథకంలో భాగంగా ఏటా 67.27 లక్షల మంది విద్యార్థులకు ఏటా రూ.15వేల చొప్పున అందిస్తున్నామన్నారు. ఇందుకోసం రెండేళ్లలో రూ.20,090 కోట్లు ఖర్చు చేశామని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలోనే తల్లికి వందనం కింద 32,969 మంది విద్యార్థులకు రూ.49.45 కోట్లు అందించామని, ప్రతి విద్యార్థి చదువుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

**90 శాతం హామీలు అమలు చేశాం..** అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మంత్రి సవిత తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు కుటుంబానికీ ఏటా రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. రెండేళ్లలో 46 లక్షల మంది రైతులకు రూ.14,664 కోట్లు పెట్టుబడి సాయంగా అందించామన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ లక్ష్యమన్నారు. 31.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1,100 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టామని, ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 87 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ఇందుకోసం రూ.3,218 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మహిళల వంటింటి భారం తగ్గించేందుకు దీపం-2 పథకంలో 4.57 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. గ్యాస్ సబ్సిడీ కోసం రూ.3,800 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. పెనుకొండలో దీపం-2 పథకం కింద 5.74 లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని, ఇందుకోసం రూ.49.25 కోట్ల సబ్సిడీని అందజేశామని మంత్రి సవిత తెలిపారు.

**బీసీల రాజకీయ సాధికారతే లక్ష్యం..** బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించామని, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపామన్నారు బీసీల రాజకీయ సాధికారతే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల్లోనూ 34 శాతం రిజర్వేషన్ల కోసం ముందుకు సాగుతున్నామన్నారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. దాని వల్ల 16,800 రాజకీయ పదవులను బీసీలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి కృషి చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట..** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 138 బీసీ కులాల ఆత్మగౌరవానికి, రక్షణకు పెద్దపీట వేస్తూ, బీసీ ప్రొటెక్షన్ యాక్ట్-2026 తీసుకురావడానికి చర్యలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. బీసీల హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, 50 ఏళ్లు పైబడిన 1,30,796 మంది మత్స్యకారులకు రూ.505 కోట్ల మేర పింఛన్లు అందించామని తెలిపారు. వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. చేనేత కార్మికులకు కూడా అండగా నిలిచామని, 50 ఏళ్లు పైబడిన 85,940 మంది చేనేత కార్మికులకు రూ.844 కోట్ల పింఛన్లు అందించామని తెలిపారు. 62,541 నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. నేతన్నల సేవలో పథకం కింద మగ్గం కలిగిన ప్రతి నేతన్నకూ రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.

**మాటల్లో కాదు గణంకాల్లో చూపిస్తున్నాం..** దివ్యాంగుల సంక్షేమంలోనూ కూటమి ప్రభుత్వం ముందుందని మంత్రి సవిత తెలిపారు. దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల ఆత్మగౌరవం కోసం 1,750 మందికి మూడు చక్రాల వాహనాలు అందించామని, ఇందుకోసం రూ.18.47 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పేదల సంక్షేమానికే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. రైతు, మహిళ, విద్యార్థి, బీసీ, మత్స్యకారుడు, చేనేత కార్మికుడు, దివ్యాంగుడు.. ఇలా ప్రతి వర్గానికీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమాన్ని కేవలం మాటల్లో కాకుండా గణాంకాల్లో చూపిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

## స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం-మంత్రి నారాయణ

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణ ఆరోగ్య సేవా కేంద్రం, ఉచిత దంత వైద్యశాల, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో గ్రామీణ కంటి వైద్య కేంద్రం, పశువైద్యశాల వంటి సేవలు అందుతున్నాయని మంత్రి వివరించారు. అదేవిధంగా సీబీఎస్ఈ విధానంలో అక్షర విద్యాలయం, రాష్ట్ర సిలబస్ ఆధారంగా స్వర్ణభారతి విద్యామందిర్, వృద్ధాశ్రమం, పారిశ్రామిక ప్రముఖులు, నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ సమాజంలోని వివిధ వర్గాలకు సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు.

**వెంకయ్యనాయుడు ఓ వ్యక్తి కాదు-ఓ వ్యవస్థ..** వెంకయ్యనాయుడు కేవలం ఒక వ్యక్తి కాదు,ఆయన ఒక వ్యవస్థ అని మంత్రి నారాయణ కొనియాడారు. తెలుగుజాతి గర్వించదగ్గ జాతీయ నాయకుడిగా, విలువలకు నిలువెత్తు నిదర్శనంగా ఆయన నిలిచారని అన్నారు. రాజకీయ వారసత్వం లేకుండా సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవైన భారత ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నెల్లూరు జిల్లాలోని ఓ మారుమూల ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వెంకయ్యనాయుడు జీవితం యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. 25 ఏళ్లుగా నిరంతరం సేవలందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులు, సిబ్బంది, వాలంటీర్లు, భాగస్వామ్య సంస్థలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగించి సమాజాభివృద్ధిలో స్వర్ణభారత్ ట్రస్ట్ మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## కష్టపడి మెగా డీఎస్సీ సాధించిన నిరుద్యోగులపై బురదజల్లుతారా?: రాంప్రసాద్ రెడ్డి

- డీఎస్సీ విజేతలపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు మానుకోవాలన్న రాంప్రసాద్ రెడ్డి
- స్వార్థ రాజకీయాల కోసం వారిని అవమానించవద్దని హితవు
- ఉద్యోగాలు సాధించిన వారి కష్టాలను ప్రశ్నించవద్దని సూచన



**అమరావతి,కలంకౌంటర్ :** మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

## రాష్ట్ర రైతుల నీటి హక్కుల కోసం 'ఆళ్ళ' కృషి అభినందనీయం

### కె.ఎల్.యూనివర్సిటీ అల్యూమిని మీట్ లో 'ఆళ్ళ' ను ఘనంగా సన్మానించిన కె.ఎల్.యు. యాజమాన్యం


**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాజెక్టుల్లో రైతుల నీటి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న కె.ఎల్.యు పూర్వ విద్యార్థి, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు కృషి అభినందనీయమని కె.ఎల్. యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ జి.పి.ఎస్ వర్మ అన్నారు. హైదరాబాద్ లోని కె.ఎల్ యూనివర్సిటీ బాచుపల్లి క్యాంపస్ లో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన కె.ఎల్.యు అల్యుమిని మీట్ జరిగింది. సమావేశంలో సమాజం కోసం కృషిచేసిన పూర్వ విద్యార్థులు, అల్యుమిని సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నీటి యాజమాన్యంలో రైతుల భాగస్వామ్యం కోసం విశేషంగా కృషి చేస్తున్న పూర్వ విద్యార్థి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ను కె.ఎల్.ఇ.ఎఫ్. ఉపాధ్యక్షురాలు కోనేరు నిఖిల, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్ వర్మ తదితరులు 'ఆళ్ళ' ను దుశ్శాలువతో ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్ వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో సాగునీటి రంగంపై విశేష అనుభవం ఉన్న మా పూర్వ విద్యార్థి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ఇంజనీరుగా, జల వనరుల రంగ నిపుణులుగా, ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాజెక్టుల్లోని నీటి హక్కులపై కృష్ణానది యాజమాన్య బోర్డు, కేంద్ర జలసంఘంతో సంప్రదింపులు జరుపుతూ నిత్యం కృషి చేస్తున్నారని, అలాగే నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ కు ఆరుతడి పంటలకు సాగునీరు రావటానికి విశేషంగా కృషి చేశారని, ఇలాంటి వ్యక్తులు మా కె.ఎల్.యు. అల్యుమిని సభ్యులుగా ఉండటం మాకెంతో గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో కె.ఎల్.యు. అల్యుమిని రిలేషన్స్ అధిపతి డాక్టర్ కె.పి.హెచ్ శ్రీకావ్య, యూనివర్సిటీ ప్రో-వైస్ ఛాన్సలర్ వెంకట్రామన్, అల్యుమిని సభ్యులు గొరిపర్తి వెంకటరమణ, పొట్లూరి శ్రీధర్, డాక్టర్ బద్రీనాథ్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ మార్కెట్లో మన ఎంఎస్ఎంఈలు!

- పరిశ్రమల రాణింపునకు ఎగుమతులకు కొత్త ద్వారాలు
- 200కు పైగా ఎంఎస్ఎంఈలు.. 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు
- 100 ఎగుమతి ఒప్పందాలు, రూ. 100 కోట్ల వ్యాపార అవకాశాలు లక్ష్యం
- ఏపీ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- ఎంఎస్ఎంఈలను కొత్త అంతర్జాతీయ మార్కెట్లను చేరువ చేసేందుకు కృషి
- ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్

**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు దేశీయ మార్కెట్లకే పరిమితం కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడే స్థాయికి ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వాతావరణాన్ని బలోపేతం చేస్తూ 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' విధానంతో ఉద్యోగాలను కోరుకునే వారిని ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏపీ ఎంఎక్స్‌డీపీ)లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలను అంతర్జాతీయ ఎగుమతులకు సిద్ధం చేయడం లక్ష్యంగా విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం ఏపీ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్--2026 కార్యక్రమం ప్రారంభమైంది. ర్యాంప్ కార్యక్రమం స్ఫూర్తితో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండియా ఎస్ఎంఈ ఫోరం భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్‌తో పాటు అంతర్జాతీయ కొనుగోలుదారులు, రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరువ చేయడం, విదేశీ కొనుగోలుదారులతో ప్రత్యక్ష వ్యాపార సంబంధాలను ఏర్పరచడం లక్ష్యంగా రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 200కు పైగా ఎంఎస్ఎంఈలు, 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. బుర్కినా ఫాసో, కామెరూన్, కోట్ డి ఐవరీ, ఘనా, జపాన్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, జాంబియా, జింబాబ్వే తదితర దేశాల నుంచి కొనుగోలుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, పెట్టుబడులు, అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ కొనుగోలుదారులతో నేరుగా చర్చించి తమ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లను అన్వేషించడం జరుగుతుందన్నారు. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా మన ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తుల నాణ్యత, ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. ఈ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్ ద్వారా కనీసం 100 ఎగుమతి ఒప్పందాలు, ఆర్డర్లు సాధించడంతో పాటు సుమారు రూ. 100 కోట్ల మేర ఎగుమతి వ్యాపార అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి కొనుగోలుదారులను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించడం ద్వారా రాష్ట్ర ఎంఎస్ఎంఈలకు కొత్త అంతర్జాతీయ మార్కెట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కొనుగోలుదారులు--ఎంఎస్ఎంఈల మధ్య జరిగే చర్చలను వాస్తవ వ్యాపార ఒప్పందాలు, ఎగుమతి ఆర్డర్లు, దీర్ఘకాలిక అంతర్జాతీయ భాగస్వామ్యాలుగా మార్చడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్‌లో వ్యవసాయం--ఆహార ఉత్పత్తులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, వస్త్రాలు--దుస్తులు, ఎలక్ట్రానిక్స్--ఎలక్ట్రికల్స్, ఔషధాలు--ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, ఆరోగ్యం--వెల్‌నెస్, సౌర విద్యుత్ పరికరాలు, రసాయనాలు, ఆటోమొబైల్--ఆటో కాంపోనెంట్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర 11 ప్రాధాన్యతా రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ఇండియా ఎస్ఎంఈ ఫోరం అధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు కేవలం ఉత్పత్తిదారులుగా కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడగలిగే స్థాయి సరఫరాదారులుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ కొనుగోలుదారులను నేరుగా విజయవాడకు తీసుకురావడం ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునే అవకాశాన్ని సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల ద్వారా తక్షణ ఆర్డర్లతో పాటు పునరావృత వ్యాపారం, భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక మార్కెట్ సంబంధాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు ప్రధాన విజయరామ్, నీలపు విజయానంద రెడ్డి, నల్లపనేని మురళీమోహన్, చిన్న రాజు, బండారు రవికాంత్, సత్యనారాయణమూర్తి , ఎన్టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఎంఎస్ఎంఈ





# ఆర్యవైశ్య జర్నలిస్టుల ఆత్మీయ కలయిక





**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లాలో అందుబాటులో ఉన్న ఆర్యవైశ్య జర్నలిస్టులు ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ రాక సందర్భంగాజిల్లా కో ఆర్డినేటర్ గొంట్ల కృష్ణ అధ్యక్షతన ఆత్మీయ కలయిక నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ ను ,సీనియర్ జర్నలిస్టులు సత్యన్నారాయణ,కృష్ణారావు లను సత్కరించారు. అనంతరం కనిగిరి వాసవి వృద్ధాశ్రమం ఫౌండర్ అన్నా సత్య రంగనాయకులు సేవల్ని గుర్తించి సన్మానించారు.

# వినాయక చవితి వ్రత కల్పం పుస్తకం ఆవిష్కరణ

- వాసవి అమ్మవారి వెండి వంశ వృక్షం విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలోపాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ,శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు, కలం కౌంటర్ రవికుమార్





**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురంలో కలం కౌంటర్ దినపత్రిక వినాయక చవితి వ్రత కల్పం పుస్తకాలు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అన్నా. రాంబాబు,శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు,మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల మురళీ కృష్ణ, వక్కలగడ్డ మల్లిఖార్జునరావు, రాచమడుగు రమేష్, శ్రీశైలం అన్నపూర్ణ చైర్మన్ జి ఎస్ రత్నం, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, గొంట్ల కృష్ణ, దేవస్థానం కమిటీ సభ్యులు,ప్రముఖులు పాల్గొన్నారు

**రవికుమార్ ను సత్కరించిన దేవస్థానం కమిటీ...** కలం కౌంటర్ దినపత్రిక అధినేత,ఏపీ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికుమార్ ను శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు,శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాల మురళీ కృష్ణ తదితరులు ఘనంగా సత్కరించారు.



# శివశక్తీశ్వర ఆలయానికి చేసిన స్వామి శ్రీనివాసానంద సరస్వతి

- భారతీయ వివాహ వ్యవస్థ సనాతన ధర్మానికి ప్రతీకా
- వారిని రూపొందించిన మాజీ ఎయిర్‌ఫోర్స్ అధికారి మురళీకృష్ణ గారిపై ప్రశంసల వర్షం





**విజయనగరం,కలంకౌంటర్ :** భారతీయ వివాహ వ్యవస్థను దేశ ప్రజలు బలంగా విశ్వసిస్తున్నందున భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎప్పటికీ చెక్కుచెదరకుండా ఉంటాయని ఏపీ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి సోమవారం అన్నారు. భారతీయ వివాహ విధానం హిందూ సనాతన ధర్మానికి నిదర్శనమని, ఇది ప్రజలను ఎప్పటికీ సన్మార్గంలో పయనించాలని బోధించిందని ఆయన అన్నారు. విజయనగరం జిల్లా, చీపురుపల్లి మండలం, అలక నారాయణపురంలో విశ్రాంత వైమానిక దళ అధికారి కురిచెటి మురళీ కృష్ణ మరియు వారి కుటుంబ సభ్యులు నిర్మించిన శివశక్తిశ్వర ఆలయ ప్రారంభోత్సవం అనంతరం, ఆయన శివపార్వతుల పవిత్ర వివాహాన్ని జరిపించారు. ప్రధాన ఆలయ ప్రాంగణంలో శివలింగ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి శ్రీనివాసానంద మాట్లాడుతూ, శివ పార్వతులను ఆది దంపతులుగా పరిగణిస్తారని, దేశంలో వేల సంవత్సరా లుగా వారికి అనుసరించే వివాహ సంప్రదాయాలు అలాగే కొనసాగుతున్నా యని అన్నారు. భార్యాభర్తల మధ్య చివరి శ్వాస వరకు బంధాన్ని బలంగా ప్రోత్సహించే భారతీయ వివాహ వ్యవస్థపై పాశ్చాత్య సంస్కృతి, సహజీవనం వంటి భావనలు ఎలాంటి ప్రభావం చూపవని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ దివ్య వివాహానికి సమీప ప్రాంతాల ప్రజలు హాజరై, తమ ప్రాంతంలో శివాలయం నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



జాతీయ బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుడు బొమ్మిశెట్టి ప్రభు,పద్మశ్రీల వివాహ రిసెప్షన్ సోమవారం కప్పలదొడ్డి గ్రామంలో జరిగింది ఈ కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ మరియు యువ న్యాయవాది లంకిశెట్టి సాయి పణి సంతోష్ తదితరులు

**-మచిలీపట్నం,కలంకౌంటర్ :**

# ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

# 2 లక్షల సీడ్‌బాల్స్‌తో ఎన్టీఆర్ జిల్లాలో పచ్చదనానికి బాట

- పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ.





**విజయవాడ,కలంకౌంటర్ :** స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం వన్ ఎర్త్--వన్ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సీడ్‌బాల్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పాల్గొన్నారు. పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధించాలనే లక్ష్యంతో వన్ ఎర్త్--వన్ లైఫ్ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, సంస్థ వాలంటీర్లు తయారు చేసిన 2 లక్షల సీడ్‌బాల్స్‌ను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ సీడ్‌బాల్స్ ద్వారా ప్రకృతి పునరుత్పత్తికి, పచ్చదనం పెంపునకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం వన్ ఎర్త్--వన్ లైఫ్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థులు, మహిళలు, యువతను పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో పర్యావరణ స్పృహ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్రత, రీసైక్లింగ్ తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. అంతరించిపోతున్న దేశవాళీ విత్తనాలను సంరక్షిస్తూ, వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంప్రదాయ విత్తన సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే మైక్రో గార్డెనింగ్, మొక్కల పెంపకం, విత్తనాల సంరక్షణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణహిత జీవన విధానం వైపు నడిపించవచ్చని కలెక్టర్ అన్నారు. వన్ ఎర్త్--వన్ లైఫ్ ఫౌండర్ ఏలూరి లీలా కుమారి మాట్లాడుతూ నగరాల్లో పచ్చదనం పెంచడంతో పాటు ప్రతి ఇంటికీ పర్యావరణ పరిరక్షణను చేరువ చేయాలనే ఉద్దేశంతో తమ సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా మిద్దె తోటలను ప్రోత్సహిస్తూ గృహిణులకు మిద్దె తోటల పెంపకం, ఇంటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో 'ధన్వంతరి వనం' పేరుతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని వన్ ఎర్త్--వన్ లైఫ్ ఆధ్వర్యంలో చేపట్టామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం, విద్యార్థి, మహిళ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన బాధ్యత అని లీలా కుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2 లక్షల సీడ్‌బాల్స్‌ను అనుకూలమైన కొండలు, అటవీ, బంజరు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా వెదజల్లి, సహజంగా విత్తనాలు మొలకెత్తేలా చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ ఎర్త్ -- వన్ లైఫ్ వాలంటీర్ టీం సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కుప్పంలో టీచర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**అమరావతి, కలంకౌంటర్ :** చిత్తూరు జిల్లా కుప్పంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గురుపూజోత్సవం రోజే, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఒక ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు దేశానికి సేవ చేసిన ఒక మాజీ సైనిక హవల్దార్ కావడం గమనార్హం. ఈ ఘటనను పాఠశాల విద్యాశాఖ సుమోటోగా స్వీకరించి, నిందితులపై కఠినమైన క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. ఇది స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఒక వ్యవస్థీకృత బెదిరింపుల దందా అని అనుమానిస్తున్నామని అధికారులు తెలిపారు.

**విద్యార్థుల ముందే దాడి..** వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున కుప్పంలోని ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. మాజీ సైనికుడైన ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా, ఇద్దరు వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. తాము మీడియా ప్రతినిధులమని చెబుతూ, ఉపాధ్యాయుడి మిలిటరీ గుర్తింపు కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు చూపించాలంటూ దురుసుగా ప్రవర్తించారు.

# అంగరంగ వైభవంగా వెండి వంశ వృక్షం విగ్రహ ప్రతిష్టాపన

## దేశంలో మొదటి వెండి వంశ వృక్ష గోత్ర నామ సహిత విగ్రహం







**మార్కాపురం,కలంకౌంటర్ :**మార్కాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో వెండి వంశ వృక్ష గోత్ర నామ సహిత విగ్రహా ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.దేశంలో తొలిసారి వెండి వంశ వృక్ష గోత్ర నామ సహిత విగ్రహా ప్రతిష్ట జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ,శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు, శ్రీశైలం అన్నపూర్ణ సత్రం చైర్మన్ జి ఎస్ బాబు, ఏపీ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సి హెచ్ రవికుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో , మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల మురళీ కృష్ణ, టీడీపీ నాయకుడు వక్కలగడ్డ మల్లిఖార్జునరావు,ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుబ్బారావు,రామడుగు వెంకట రమేష్ , దేవస్థానం కమిటీ సభ్యులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.దాతలకు సన్మానం చేశారు.









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com